ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 15 ఆగస్టు 2024 | 7





జాతీయ పతాకాలతో 'ఆదిత్య' విద్యార్థుల ర్యాలీ



500 మీటర్ల జాతీయ పతాకంతో అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

దేశ భక్తి సమైక్యత చాటుతూ

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



కలెక్టరేట్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 14: దేశ భక్తి, సమైక్యత చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద హర్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి నల్ల వంతెన వరకు జరిగిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా... భారత్‌మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జాతీయ జెండాలను ఇళ్లపై ఎగురవేసి ఆయా పతాకాలతో సెల్ఫీలు దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ర్యాలీ అనంతరం హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ సెల్ఫీ దిగి కాన్వాస్ బోర్డుపై సంతకం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్‌ప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పీఎస్ సురేష్‌కుమార్, స్వయం సహాయక సంఘాల మహిళలు, డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ బల్బులో జాతీయ జెండా



చిత్రలేఖన ఉపాధ్యాయుడు శ్రీను

విద్యుత్ బల్బులో జాతీయ జెండాను అమర్చి అబ్బురపరిచాడు రామచంద్రపురం మండలం హసన్‌బాద పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు జి.శ్రీను. ముందుగా బల్బుకు రంధ్రం చేసి సాల్టు వేశాడు. అనంతరం మైనం, కొవ్వొత్తులను ద్రవ రూపంలో పంపించాడు. దారాలతో ధర్మచక్రం తయారు చేసి రెండు భాగాలుగా బల్బులో జాతీయ జెండా మధ్యలో అమర్చి చూడముచ్చటగా రూపొందించాడు. శ్రీనును సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌సీటీఎస్ సుందరి, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. - ద్రాక్షారామ

నిర్ణీత కాల వ్యవధిలోనే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అందజేసిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిర్ణీత కాల వ్యవధిలోపు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ 11వ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. గత డిసెంబరులో జరిగిన పదో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత డిసెంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల ఏర్పాటు కోసం జిల్లా నుంచి 176 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 163 దరఖాస్తులకు అనుమతి ఇచ్చి మార్గదర్శకాలకు అనుగుణంగాలేని ఆరు దరఖాస్తులను తిరస్కరించామన్నారు. మరో ఏడు దరఖాస్తులకు అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాయవరం మండలం మాచవరంలో రూ.14.83 కోట్లతో శ్రీమహాలక్ష్మి పల్సెస్ క్లస్టర్ ఈ నెలాఖరుకు అందుబాటులోకి వస్తుందన్నారు. మామిడికుదురులో రూ.10కోట్ల ప్రాజెక్టు విలువతో నిర్మిస్తున్న కొబ్బరి, కొబ్బరి వాల్యూయేటెడ్ ఉత్పత్తుల క్లస్టర్, మండపేటలోని మ్యాటర్సెస్ క్లస్టర్లకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టులు పంపించామన్నారు. ఆత్రేయపురంలోని పూతరేకుల క్లస్టర్, మలికిపురంలోని కోకోనట్ ఉత్పత్తుల క్లస్టర్లు డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు. వివిధ పరిశ్రమల అభివృద్ధి విధానాల కింద అందించే ప్రోత్సాహకాలకు సంబంధించి జిల్లాలో 12 ఎంటర్‌ప్రైజెస్ నుంచి వచ్చిన 14 ప్రోత్సాహక క్లయిమ్‌లు రూ.73,25,962లను స్క్రూటినీ, పరిశీలన అనంతరం కమిటీ మంజూరు చేసిందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జిల్లా రవాణా అధికారి అశోక్‌ప్రతాపరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి బీవీ రమణ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు వర్మ, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం రాత్రి విద్యుత్ వెలుగులు, త్రివర్ణ పతాకాలతో అమలాపురంలోని కలెక్టరేట్ ప్రాంగణం



మొగ ద్వారా మురుగునీరు సముద్రంలోకి ప్రవహిస్తున్న దృశ్యం

కూనవరం మొగ పునరుద్ధరణ

- సముద్రంలోకి దిగుతున్న మురుగునీరు
- 20వేల ఎకరాలకు తక్షణ ఉపశమనం

ఉప్పలగుప్తం, ఆగస్టు 14: కూనవరం మేజర్ డ్రెయిన్‌ను సముద్రానికి అనుసంధానం చేస్తూ ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి గండి ఏర్పాటు చేశారు. దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇసుక మేటల తవ్వకం పూర్తి కావడంతో డ్రెయిన్ నుంచి ముంపునీరు దిగేలా సముద్రానికి గండి కొట్టి మొగ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనివల్ల నాలుగు మండలాల్లోని 20వేల ఎకరాల సార్వా పొలాలకు ఉపశమనం కలుగుతుందని డ్రెయిన్స్ డీఈఈ కిశోర్ తెలిపారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌లో ముంపునీటి ప్రవాహ ఒత్తిడి ఉన్నంత వరకు మొగ వల్ల దిగువ, ఎగువ రైతులందరికీ ప్రయోజనముంటుందని అధికారులు అంటున్నారు. ప్రవాహ ఒత్తిడి పెంచేందుకు చిర్రయానాం పాత వంతెన వద్ద కర్రలు, బరకాలతో అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. డ్రెయిన్‌లో మొగకు దిగువన ఇసుక మేటలు వేయడంతో ముంపునీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడి మొగ సమీపంలో ప్రవాహ వేగం తగ్గుతోంది. దీని పరిష్కారానికి మేజర్ డ్రెయిన్‌లో ఇసుక మేటలు తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతు నాయకులు బుధవారం మొగను పరిశీలించారు. తవ్వి గుట్టలు వేసిన ఇసుక తిరిగి మొగ మార్గాన్ని కప్పేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించకపోతే మొగ తవ్వకానికి చేసిన ఖర్చు మొత్తం వృధా అవుతుందని వ్యాఖ్యానించారు. కూనవరం డ్రెయిన్ గట్లను పటిష్ఠం చేయకుండా మొగను పునరుద్ధరించడంతో పోటు సమయంలో సముద్రం నీరు పొలాలు, చేపల చెరువుల్లోకి ప్రవహించి పంట ధ్వంసమయ్యే ప్రమాదముందని మొగ సమీప ప్రాంతంలోని గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు

- అమలాపురంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి వాసంశెట్టి సుభాష్
- పరేడ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య వేడుకలకు అమలాపురం పట్టణం సర్వసన్నద్ధమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన తర్వాత మూడో సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో స్టేడియంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధిని చాటిచెప్పేలా శకటాలను సిద్ధం చేస్తున్నారు. అన్న క్యాంటీను, ఉచిత ఇసుక, దేవదాయ శాఖ, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పరేడ్ రిహార్సల్స్ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పోలీసులు, క్రీడాకారులు బుధవారం స్టేడియంలో రిహార్సల్స్ పూర్తి చేసుకున్నారు. పోలీసులు నిర్వహించే పరేడ్ వెనకాల సెట్టింగ్‌లు కూడా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు రానున్న దృష్ట్యా ప్రత్యేక షామియానాలను వేశారు. కలెక్టరేట్‌ను జాతీయ జెండా రంగులను పోలిన విద్యుద్దీపాలు, క్లాత్ డెకరేషన్లతో అందంగా అలంకరించారు. మంత్రి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు.





అమలాపురం బాలయోగి స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతున్న వేదిక, శకటాలు



21న రావులపాలెంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఆగస్టు 14: రావులపాలెం సత్యసాయి విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ నెల 21న వికాస ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. వివిధ కంపెనీలకు సంబంధించిన పోస్టుల వివరాలు వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. 28 కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై ఆయా సంస్థలకు అనువైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు నేరుగా జాబ్‌మేళాకు వచ్చి రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. బయోడేటాతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. 2025 పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు

అమలాపురం టౌన్, ఆగస్టు 14: చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంటర్ విద్యార్థులు ఒకే విద్యను అభ్యసించడం కోసం కమిషనర్ ప్రత్యేక మార్గదర్శకాలను సూచించారన్నారు. బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. 75 రోజులు మించి హాజరు ఉంటే ఆ విద్యార్థి చక్కగా చదువుతున్నట్టు నిర్ణయిస్తారన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, ఆటల్లో కూడా ప్రావీణ్యం పొందాలని, వ్యాయామ విద్యకు సంబంధించిన అధ్యాపకులు లేకపోయినా ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ కళాశాలలో స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు.



బియ్యపు గింజలతో నెహ్రూ చిత్రం

మామిడికుదురు మండలం మగటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు షేక్ అబీబీ షానియా, గుండుపల్లి అమృతవల్లి, రావూరి పూర్ణ, బొంతు సాయిశ్రీ, మోటూరి జ్యోతి, వర్ధనపు హీబా బియ్యపు గింజలకు వివిధ రకాల రంగులు కలిపి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్దారు. డ్రాయింగ్ మాస్టారు గాలిదేవర రామకృష్ణ పర్యవేక్షణలో చిత్రాన్ని రూపొందించిన విద్యార్థులను హెచ్‌ఎం లంకలపల్లి శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. - మామిడికుదురు

త్యాగమూర్తులకు, జాతీయ జెండాకు చిత్ర వందనం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇందుగమిల్లి సౌదాసాగర్ రూపొందించిన చిత్రం ఆకట్టుకుంది. ఎందరో త్యాగమూర్తుల పోరాట ఫలితమే స్వాతంత్ర్య భారతావని అని తెలియజేసేందుకు వాటర్ కలర్స్ ఉపయోగించి గాంధీజీ, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్ చిత్రపటాలతో పాటుతో పాటు జాతీయ జెండాలు, జాతీయ చిహ్నం రూపొందించాడు. - రాయవరం





సామర్లకోటలో మువ్వన్నెల జెండాలతో బాలుడు



కాకినాడ కలెక్టరేట్‌లో విద్యుద్దీపాలంకరణలో గాంధీజీ విగ్రహం

మొక్కలతో ఆకట్టుకుంటున్న స్వాతంత్ర్య దినోత్సవం కూర్పు

● గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు

కడియం ఆగస్టు 14 : కడియం పల్ల వెంకన్న నర్సరీలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నర్సరీ రైతులు మొక్కలతో గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీయేట వినూత్నంగా మొక్కలతో ఇక్కడ శుభాకాంక్షలు తెలుపుతారు. ఇందులో భాగంగా బుధవారం నర్సరీలో వినూత్నంగా మొక్కలతో అలంకరించి దేశాభిమానాన్ని చాటుకున్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మొక్కలతో నర్సరీ రైతులు ఏర్పాటు చేసిన కూర్పు



మహాత్మాగాంధీ ఒక రోజు బస చేసిన ముప్పనవారి బంగ్లా

పెద్దాపురంలో మహాత్ముడి తీపిగుర్తులు

పెద్దాపురం, ఆగస్టు 14: పెద్దాపురంలో జాతిపిత మహాత్మాగాంధీ తీపిగుర్తులు ఉన్నాయి. మహాత్ముడు పట్టణంలో రెండు ప్రాంతాలను సందర్శించినట్లు పలువురు చెబుతున్నారు. దీంట్లో పట్టణంలో ఉన్న మెయిన్‌రోడ్డు కాగా, రెండవది ముప్పనవారి బంగ్లా అని చెప్పవచ్చు. 1942లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు ఆయన వచ్చినప్పుడు పెద్దాపురం పట్టణాన్ని మహాత్ముడు సందర్శించారు. డైలీమార్కెట్, మెయిన్‌రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులనుద్దేశించి ప్రసంగం చేశారు. అప్పటినుంచి ఆసెంటర్‌ను గాంధీ బొమ్మ సెంటర్ అని పిలుస్తారు. అలాగే మహాసభ ముగిసిన అనంతరం ఆయన ముప్పన వారి బంగ్లాలో ఆరోజు రాత్రి బసచేశారని పెద్దలు చెబుతున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తికి ఊతమిచ్చిన దేవులపల్లి గేయం



దేవులపల్లి కృష్ణ శాస్త్రి

సామర్లకోట, ఆగస్టు14: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి నాడు దేశవ్యాప్తంగా ఎంతో ఊతమిచ్చిన గేయం దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన జయజయ ప్రియ భారత జనయిత్రి దివ్యధాత్రి నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకం కావడం విశేషం. ఈగేయ రచయిత దేవులపల్లిది ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదా వరిజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కావడంతో ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యం సంతరించుకోవడం విశేషం. దేవులపల్లి కృష్ణశాస్త్రి జన్మస్థలం కాకినాడజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కాగా, కాకినాడ పీఆర్ కళాశాలలో ఉన్న త విద్యాభ్యాసంచేసి తొలిసారిగా పెద్దాపురం లూధరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 1919లో చేరారు. 1945లో సినీరంగంలో ప్రవేశించిన దేవులపల్లి స్వాతంత్ర్య పోరాటయోధులను మరింత ఉత్తేజితులను చేసేందుకు గానూ జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి అనే గేయం రచించగా అప్పట్లోనే ఈ గేయం ఎంతో పాపులా రిటీ సాధించింది. 1986లో చిరంజీవి నటించిన రాక్షసుడు సినిమాలో ఇదే గేయాన్ని తిరిగి తెరకెక్కించడం ద్వారా దేవులపల్లి గేయం మరోసారి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకుంది..



కపిలేశ్వరపురం: అంగరలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు



దివాన్‌చెరువు: నామవరంలో భారతదేశం ఆకృతిలో నిల్చున్న ఓ పాఠశాల విద్యార్థులు

వాడపల్లిలో స్వరాజ్య స్ఫూర్తి



వాడపల్లిలో స్వాతంత్ర్య పోరాటయోధుల స్థూపం

ఆత్రేయపురం, ఆగస్టు 14: దైవభక్తి, దేశభక్తి చాటిన నేలగా వాడపల్లి వాడని మల్లెగా విరజిల్లుతోంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్నారు. రథంపై బాపూజీ చిత్రపటాన్ని, స్వరాజ్య జెండాను దేశభక్తులు ఎగురవేశారు. బ్రిటీష్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ ముస్తాఫ్ ఆలీఖాన్ రథోత్సవం వద్దకు వచ్చి గాంధీ చిత్రపటాన్ని, మువ్వన్నెల జెండాను తొలగించాలని ఆదేశించారు. దేశభక్తులు ససేమిరా అనడంతో లాఠీ చార్జ్‌చేసి తుపాకీ కాల్పులు జరిపారు. నలుగురు పోరాటయోధులు అమరులయ్యారు. వందలాది మంది గాయపడగా మరికొంత మందిని జైళ్లలో బంధించారు. నాటి పోరాటంలో దేశభక్తులు కోపోద్రిక్తులై బ్రిటీష్ పాలకులపై తిరగపడగా పలాయనం చిత్తగించారు. దేశభక్తితో పాటు దైవభక్తిగా చాటుకున్న నేలగా వాడపల్లి చరిత్ర కెక్కింది. ఈ పోరాట స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలనే మంచి ఉద్దేశంతో రాజకీయ దురంధరుడు, గాందేయవాది, మాజీ ఎమ్మెల్యే మంతెన వెంకట సూర్యసుబ్బరాజు వాడపల్లి క్షేత్రం ఎదురుగా స్మారక స్థూపాన్ని నిర్మించారు. స్వామివారి కల్యాణం, రథోత్సవం తిలకించ డానికి వచ్చే లక్షలాది మంది భక్తులు అమరులకు నివాళులర్పిస్తూ చరిత్ర తెలుసుకుంటున్నారు. స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసేందుకు ఈ స్థూపాన్ని ముస్తాబు చేస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ర్యాలి గ్రామం ఎంతో ప్రత్యేకత చాటుకుంది. 1929లో విదేశీ వస్తు బహిష్కరణపై పోరాటం సాగిస్తున్నారు. అందులో భాగంగా గాంధీజీ ర్యాలి గ్రామాన్ని సందర్శించారు. వేల సంఖ్యలో దేశభక్తులు బాపూజీ వెంట నడిచారు. గాంధీ ర్యాలి వచ్చిన సందర్భంగా 1953లో జగన్మోహినీ కేశవస్వామి గుడి వీధిలో దివంగత పి.సురపరాజు గాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు.



ర్యాలి గాంధీ వచ్చిన సందర్భంగా నిర్మించిన మహాత్ముని విగ్రహం



ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

212 బెటాలియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఎటపాక, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఎటపాక సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ప్రభాత్ భేరీ నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కమాండెంట్ దిపక్ కుమార్ పాల్గొన్నారు.



ఆలయంలో ఏర్పాటుచేసిన ఫొటో షూట్, ఆలయ ముఖ మండపంలో ఫల, పుష్పాలతో అలంకరణ

వైభవంగా వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

● ఫల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ
● ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు
● గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

ఆత్రేయపురం, ఆగస్టు 14:వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు పవిత్రోత్సవాలను మేళతాళ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నిపుణుల ఆధ్వర్యంలో ఫల, పుష్ప అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వసంత మండపంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు తొలిరోజును విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజ, అగ్నిమథనం, ప్రతిష్ఠాపన, వాస్తుహోమాలను వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పుష్పాలతో నెమలి అలంకరణలో ఫొటో షూట్‌వద్ద భక్తులు సందడి చేశారు.



స్వామివారి పవిత్రోత్సవాల్లో ఉప కమిషనరు పూజలు

వేర్వేరు కేసుల్లో 104 కేజీల గంజాయి స్వాధీనం

● ఐదుగురు నిందితుల అరెస్టు

చింతూరు, ఆగస్టు 14: రెండు వేర్వేరు కేసుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, మోతుగూడెం పోలీసులు 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఈమేరకు బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. అల్లూరి సీతారామరాజుజిల్లా జీకే వీధి మండలం వలసగడ్డకు చెందిన మజ్జి గిన్ను, కోయిలంగి ధనరాజులు ఇరువురు కలసి వారి ఆటోలో 100 కేజీల గంజాయిని వయా మోతుగూడెం మీదుగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు తరలించేయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు పోలీసుస్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేస్తుండగా గంజాయితోపాటు వారిద్దరు పట్టుబడ్డారు. గంజాయి తరలింపున కు పైలట్‌గా వ్యవహరించిన మజ్జి కృపానంద పరారయ్యాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంనకు చెందిన కుమార్‌కు నిందితులు గంజాయి చేరవేసే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తమ విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు. ఇదిలావుండగా అస్సాంకు చెందిన ధృభజ్యోతి కోన్వార్, మణేశ్వరి నార్జారి, గోబిన్ బోనియాలు రెండు ద్విచక్ర వాహనాలపై చింతూరు మీదుగా భద్రాచలంవైపు వెళుతుండగా చింతూరు పోలీసులు పోలీసుస్టేషన్ పరిధిలో వారిని నిలువరించి వాహన తనిఖీలు చేశారు. దీంతో ద్విచక్ర వాహనాలకు చెందిన సీట్ల కింది 4 కేజీల గంజాయి బయటపడిందన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తంమీద ఈ రెండు కేసుల్లో ఐదుగురు నిందితులను ఒక ఆటో, రెండు మోటారు సైకిళ్లు, 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకు న్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5,20,000 ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్ర మంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న అల్లూరి జిల్లా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా



మలేషియాలో కోనసీమ వాసి కష్టాలు



మట్టా రాంబాబు

ఆత్రేయపురం, ఆగస్టు 14: అప్పులు చేసి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో మలేషియా వెళ్లి అక్కడ కష్టాలు పడుతున్న కోనసీమ వాసి గాథ ఇది... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన మట్టా రాంబాబు కుటుంబాన్ని పోషించుకునేందుకు మూడునెలల క్రితం మలేషియా వెళ్లాడు. ఏజెంటు ద్వారా రూ.2.50 లక్షలు ఖర్చుచేసి వెళ్లిన రాంబాబు అక్కడ విశ్రాంతి లేకుండా 12 గంటలు పనిచేయించడంతో ఒత్తిడికిగురై ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. అక్కడ ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న అతడు పనిఒత్తిడి అధికంగా ఉందని యజమానులను ప్రశ్నిస్తున్నా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా డు. రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను బాగా చదివించి మంచి గృహం నిర్మించాలనే ఆశతో మలేషియా వెళ్లానని... అక్కడ ఎన్నో ఇబ్బందులు పడుతున్న తనను స్వగ్రామానికి తీసుకురావాలంటూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సోషల్‌మీడియా ద్వారా సందేశాన్ని పంపించాడు. తనను ఇండియాకు పంపించాలని యజమానిని కోరగా తిరిగి డబ్బులు కట్టి వెళ్లు అంటూ బెదిరస్తున్నాడని వాపోయాడు. తనకు ఆర్థిక స్తోమతలేదని కూటమి ప్రభుత్వం తనను రప్పించాలని కోరుతూ వాట్సాప్‌లో పెట్టిన సందేశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఎట్టకేలకు బయటపడిన నావ

● నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను వెలికితీసిన యజమాని

ధవళేశ్వరం, ఆగస్టు 14: కాటన్ బ్యారేజ్ మొదటి గేటు వద్ద నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను ఎట్టకేలకు నీటి నుంచి బయటకు తీశారు. నీట మునిగిన నావను 23 రోజులుగా బయటకు తీయకపోవడంపై కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికారులకు క్లాస్ తీసుకోవడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. డెల్టా సీఈ ఎస్.పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు రంగంలోకి దిగి మునిగిన నావను వెంట నే బయటకు తీయాలంటూ నావ సొంతదారుడుకి అల్టిమేటం జారీ చేయడంతో తగు విధంగా సహకరించి పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం నావలో మేటవేసిన ఒండ్రు, ఇసుకను తొలగించారు. బుధవారం ఉదయం నుంచి కప్పీలు, క్రైన్‌ల సహాయంతో ప్రయత్నించడంతో నీట మునిగిన నావ నీటి నుంచి బయటకు వచ్చింది. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. బ్యారేజ్ గేట్లను ఆపరేట్‌చేసి నీటి విడుదలను నియంత్రించనున్నారు.



నీటిపై తేలియాడుతున్న డ్రెడ్జింగ్‌నావ

బిక్కవోలులో లక్ష్మీగణపతి చవితి ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, ఆగస్టు 14: రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వచ్చేనెల 7న నిర్వహించే చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి మహాలక్ష్మితో కలసి పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయి బాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్, రాయుడు రామచంద్రరావు, లారీ యూనియన్ సభ్యులు, ఎఫ్‌సీఐ జట్టు కార్మికులు, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.



బిక్కవోలులో పందిరిరాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



కొండల నడుమ సూర్యాస్తమయం


అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం ఫోర్‌బై డ్యాంవద్ద బుధవారం కొండల నడమ సూర్యాస్తమయ సమయంలో బంగారువర్ణంతో సూర్యకిరణాలు మిరిమిట్లుగొలుపాయి. ఈ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని పర్యాటకులు సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

- మోతుగూడెం

ప్రియురాలికి వివాహమైందని ప్రియుడి ఆత్మహత్య

కరప, ఆగస్టు 14: ప్రియురాలికి వివాహమైందని తెలిసి ఆమె ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరపమండలం జడ్.బావారం గ్రామానికి చెందిన పలివెల విజయకుమార్(22) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పెద్దాపురానికి చెందిన ఒక యువతి అతని ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారితీసి పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఆ యువతికి 4రోజుల క్రితం వేరొక వ్యక్తితో వివాహమైనట్లు తెలిసింది. దీంతో తట్టుకోలేని విజయకుమార్ జీవితంపై విరక్తితో ఈనెల 13న గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మొక్కు తీర్చుకున్న బండారు అభిమానులు

రావులపాలెం, ఆగస్టు 14: సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు విజయం సాధించడంతో పాటు ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలని కొంత మంది బండారు అభిమానులు తిరుమల వేంకటేశ్వరస్వామిని మొక్కుకున్నారు. తిరుమలకు వారు మెట్ల మార్గంలో చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పసుపులేటి రాధాకృష్ణ, సాధనాల శ్రీనివాసరావు, ఇళ్ళ వెంకట్రామయ్య, వెలిశెట్టి మణికంఠ స్వామివారిని దర్శించుకున్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ







అమలాపురం: కామనగరువులో జాతీయ పతాకాలతో ర్యాలీ, ముమ్మిడివరం:అయినాపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ, ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో 78 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

అమలాపురంరూరల్, ఆగస్టు14: కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు బుధవారం చేపట్టిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి శృతిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విద్యార్థులు జాతీయ పతాకాలను చేతబూని భారత్‌మాతాకీ జై.. వందేమాతరం అంటూ నినాదాలతో హోరెత్తించారు. అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటరు నుంచి గడియార స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా నిర్వహించిన ర్యాలీలో డీఈవో ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధ పాల్గొన్నారు. ర్యాలీలోభాగంగా విద్యార్థినులు భరతమాత వేషధారణలతో అలరించగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్‌ఎన్.శేషారెడ్డి అభినందించారు.

500 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 500మీటర్ల జాతీయ పతాకంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు జాతీయ సమైక్యతను, సమగ్రతను చాటుతూ భారత్‌మాతాకీ జై.. అంటూ హైస్కూలు సెంటరు నుంచి గడియార స్తంభంసెంటరు వరకు ప్రదర్శనలో పాల్గొన్నారు.

ముమ్మిడివరం: విద్యార్థుల్లో జాతీయభావం, దేశభక్తిని పెంపొందించేందుకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ తోడ్పడుతుందన్నారు. బుధవారం అయినాపురం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన హర్‌ఘర్‌తిరంగా ర్యాలీని సర్పంచ్ మోకా రామారావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రతీ ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలని నినాదాలు చేశారు. మానవహారంగా ఏర్పడి దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రేలంగి సూర్యవెంకటగౌడ్, సీసీఆర్టీసీ ట్రైనీ టీవీ కృష్ణారెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్లు కేవీఎస్ఎస్ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారులు బొజ్జా రమణశ్రీ, రాయుడు ఉదయభాస్కర్, పాఠశాల హెచ్‌ఎం టీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం తారా కళాశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించి ఐక్యతను చాటారు. సీహెచ్ గున్నేపల్లిలో విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, గంజి నానాజీ, మట్ట సూరిబాబు, సమరసత సేవాఫౌండేషన్ సబ్‌డివిజన్ కన్వీనర్ గొలకోటి సాయిబాబు, గాలిదేవర బుల్లి, గాలేదేవర వెంకటరమణమూర్తి, గొలకోటి వెంకటేశ్వరరావు, బొంతు కనకారావు, హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరంఎస్ఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, బీజేపీ నాయకులు, అధికారులు జాయతీ జెండాతో బుధవారం హర్‌ఘర్ తిరంగార్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు చాట్రాతి జానకి రాంబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, ఎం.శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో ఎ.జగలక్ష్మి, సూపర్‌వైజర్ సునీత, హెచ్‌ఎం శాంతి సునీత, పీఈటీ అప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలికిపురం: కేశనపల్లి హైస్కూలు విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్కూలు కమిటీ చైర్మన్ అడబాల ఏసుబాబు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, ముత్యాల రాజబాబు, యెనుముల బాబ్జి, మాలే శ్రీనివాసనగేష్ పాల్గొన్నారు.



ద్రాక్షారామ: స్వేచ్ఛా విహంగంగా దేశ చిత్రపటం

స్వేచ్ఛా విహంగం...భారతదేశం

ద్రాక్షారామ, ఆగస్టు14: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని దేశం బానిస సంకెళ్లను తెంచుకుని పరదేశీ పాలనా పంజరం నుంచి బయటపడిన స్వేచ్ఛావిహంగ దేశ చిత్రపటాన్ని నరసాపురపుపేట జడ్పీహెచ్ఎస్ చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు త్రినాథ్‌ప్రసాద్ రూపుదిద్దాడు

78 ఆకారంలో విద్యార్థులు

కపిలేశ్వరపురం, ఆగస్టు 14: అంగర శ్రీసిద్ధార్థ కళాశాల విద్యార్థులు 78వ ఆకారంలో నిలుచుని దేశభక్తిని చాటుకున్నారు. బుధవారం కళాశాల మైదానంలో విద్యార్థులు మువ్వన్నెల జెండాను చేతబట్టి దేశకీర్తిని కొనియాడారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, కళాశాల చైర్మన్ డా. దివ్యశేఖర్, కరస్పాండెంట్ వాకా రాజా మాట్లాడారు. సమాజాన్ని అర్థంచేసుకునేందుకు విద్య దోహం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

78 మీటర్ల జాతీయ పతాకం

ఉప్పలగుప్తం, ఆగస్టు14: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 78మీటర్ల జాతీయ పతాకాన్ని తయారు చేశారు. హెచ్‌ఎం లంక రాణి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం ఈపతాకాన్ని ప్రదర్శించారు.

కరాటేలో ఆలమూరు విద్యార్థుల ప్రతిభ



ఆలమూరు, ఆగస్టు 14: విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ఆలమూరు గోల్డెన్ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జూనియర్స్ విభాగంలో మన్విత్‌నాయక్ గోల్డ్ మెడల్, సబ్ జూనియర్స్-ఎ విభాగంలో జస్వంత్‌నాయక్ సిల్వర్ మెడల్, వైట్‌బెల్ట్-బి విభాగంలో క్రిశాంత్‌నాయక్ సిల్వర్ మెడల్ సాధించినట్టు గోల్డెన్ డ్రాగన్ కోచ్ నార్గాని సెందుల్‌కుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో బహుమతులు సాధించిన వీరు ముగ్గురూ అన్నదమ్ములే. బుధవారం వీరిని గోల్డెన్ డ్రాగన్ సంస్థ గౌరవాధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, కుంగ్‌ఫూ మాస్టర్ టి.అబ్బులు, డీపీ రావు, సుధీర్‌కుమార్ అభినందించారు.

మామిడికుదురు విద్యార్థుల ప్రతిభ

మామిడికుదురు, ఆగస్టు 14: అమలాపురంలో ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు, ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ సహకారంతో జిల్లాస్థాయిలో జరిగిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో మామిడికుదురు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం సీహెచ్ నిరంజని తెలిపారు. క్విజ్ పోటీల్లో మేడిచర్ల తులసీదుర్గబాలసింధు, చిట్టూరి హర్షిణి ద్వితీయ స్థానాన్ని, వక్తృత్వ విభాగంలో వేగి బాలవెంకటశ్రీలక్ష్మిహర్షిత తృతీయ స్థానం సాధించినట్టు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 14: చోడవరం విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో చోడవరం ఫీడర్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ కె.విజయానంద్ తెలిపారు. చోడవరం, యనమదల, నరసాపురపుపేట, ఓదూరు, ఇండస్ట్రియల్ సర్వీసెస్‌పై ఉండే ఆక్వా సర్వీసులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

యానాం,ఆగస్టు14: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రాతితో చేపడుతున్న నిర్మాణ పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. మొదటి దశలో రూ.6కోట్లతో పనులు చేపట్టారు. రెండోదశ టీటీడీ,భక్తుల సహకారంతో పనులు జరుగుతున్నా యి. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని మల్లాడి కోరారు.

ఉచితంగా ఆనందయ్య ఆయుర్వేదం మందు

యానాం, ఆగస్టు14: వైరల్ ఫివర్, డెంగ్యు తదితర విషజ్వారలను ఆయుర్వేద వైద్యంద్వారాతగ్గించేందుకు ప్రముఖ వైద్యుడు ఆనందయ్య ప్రత్యేకం మందును యానాం వృద్ధాశ్రమం ద్వారా ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండపేట, ఆగస్టు14: అర్తమూరులో నిర్మించే అంగన్‌వాడీ పాఠశాలకు, సత్యభాస్కర జడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మాణ పనులకు వేగుళ్ల జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలుగూరి అన్నపూర్ణ, ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి(జంబయ్య), తాడి శేషారెడ్డి, మాజీ సర్పంచ్ ఎన్.వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, చిర్ల రామన్నకాపు, కాకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

18న తాలూకా శెట్టిబలిజ సంఘం ఎన్నిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 14: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఈనెల 18న శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరుగుతుందని శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, కార్యదర్శి వాసంశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నరాల ఏడుకొండలు తెలిపారు.

మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

రాయవరం, ఆగస్టు 14: మాచవరానికి చెందిన సత్తి భామిరెడ్డి అందించిన 300మొక్కలను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పంపిణీ చేశారు. పర్యావరన పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రిమ్మలపూడి వేణుగోపాలదొర, కె.మాదవరావు, దేవళ్ల వెంకట్రావు, గొడితి సత్యం, పోతుల బుజ్జి, చింతా రామకృష్ణ, వల్లూరి వెంకట్రావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి తహశీల్దార్‌గా నాగలక్ష్మమ్మ

అంతర్వేది, ఆగస్టు 14: సఖినేటిపల్లి మండల తహసీల్దార్‌గా నాగలక్ష్మమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆమెకు రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు బొల్లప్రగడ సీతారావు, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఎంఈవోలు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు.

తహశీల్దార్‌గా కాశీవిశ్వేశ్వరరావు

ఐ.పోలవరం, ఆగస్టు 14: తహసీల్దార్‌గా కాశీవిశ్వేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు.

కపిలేశ్వరపురం తహశీల్దార్‌గా చిన్నారావు

కపిలేశ్వరపురం, ఆగస్టు 14: కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా పి. చిన్నారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో ఆయన రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో తహసీల్దార్‌గా పనిచేసి తిరిగి ఇక్కడ వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రాజరాజేశ్వరి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

రాజోలు తహశీల్దార్‌గా ప్రసాద్

రాజోలు, ఆగస్టు14: రాజోలు తహసీల్దార్‌గాఎన్ఎస్ఎస్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లవరంనుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనను డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

మామిడికుదురు, ఆగస్టు 14: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బాలబాలాజీ స్వామివారి ఆలయ ప్రాంగణంలో స్థానిక భక్తుడు మద్దుల పుల్లేశ్వరగుప్తా ఇచ్చిన విరాళం రూ.5లక్షలతో నిర్మించిన స్వామివారి అద్దాల మండపాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ జడ్పీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ-జనసేన, బీజేపీ మండలశాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, నాయకులు కంకిపాటి సుబ్బారావు, వాసంశెట్టి వెంకట్రావు, ఆలయ ఏసీ జి.మాధవి, కంకిపాటి నరసింహారావు, మెండా ఆదినారాయణ పాల్గొన్నారు.

40 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజోలు, ఆగస్టు 14: శివకోటి లాకుల సెంటర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 40బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. అమలాపురానికి చెందిన జి.రాఘవఅవినాష్ బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు

ముమ్మిడివరం, ఆగస్టు 14: మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు సూచించారు. వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకుడు, మండల వ్యవసాయ అధికారులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పొలం బడి గ్రామంగా ఎంపికచేసి అక్కడ రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. వరి సేద్యంలో నూతన విధానాలు పాటించడంతో పాటు యాంత్రీకీకరణ, ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. డాట్ శాస్త్రవేత్త నందకిశోర్ మాట్లాడుతూ రైతులు విచక్షణా రహితంగా పురుగుమందులు వినియోగించడం, అధిక మోతాదుల్లో ఎరువులు వినియోగించడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఉత్పత్తి అయ్యే పదార్థాల్లో విషతుల్యం శాతం ఎక్కువగా ఉండి ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తున్నాయన్నారు. ఆత్మ పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేసే పథకాలపై రైతులకు అవగాహన కల్పించి వాటిని వారు పూర్తిగా వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. శిక్షణా శిబిరంలో ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

అల్లవరం, ఆగస్టు 14: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం ముగిసాయి. సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. జడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, వడ్డి సుభాషిణి, చిట్నీడి శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి, సాధనాల సూర్యవెంకట నాగమణి, బొమ్ము బాలవేణి పాల్గొన్నారు.

మలికిపురం: సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. పంచాయతీ పరిపాలనా, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో మంగాదేవి పాల్గొన్నారు.

బోళ్ల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దేవ పరామర్శ



రాజోలు, ఆగస్టు 14: శివకోటికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, టీడీపీ నాయకుడు బోళ్ల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. శ్రీనివాస్ కుమారుడు సుమంత్, శ్రీనివాస్ సోదరుడు రాజోలు నియోజకవర్గ టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు బోళ్ల రాంబాబును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం పరామర్శించి ఓదార్చారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, కడలి మోహన్, రేకపల్లి మామాజీ, ముక్కాల బాబులు, ఇసుకపల్లి బంగారం, ఉండవల్లి బ్రహ్మాజీ, బోళ్ల ప్రతాప్, సుంకర బాబి, బోళ్ల బాబ్జిపాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

మామిడికుదురు, ఆగస్టు14: రాజోలును ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ చేస్తున్నామన్నారు.గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని, సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధ్వానంగా ఉన్న తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తామన్నారు. ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎంపీపీ కె.వనజాకుమారి పాల్గొన్నారు.

సమతా కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేస్తా

అంతర్వేది, ఆగస్టు 14: ఐదేళ్లుగా గాలికొదిలేసిన సమతా కల్యాణ మండపాన్ని తుది మెరుగులు దిద్ది ప్రజల వినియోగార్థం అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లిలోని సమతా కల్యాణ మండపాన్ని బుధవారం ఎమ్మెల్యే దేవ కూటమి శ్రేణులు, మండల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఈకల్యాణ మండపాన్ని మండలంలోనే అత్యున్నత విలువలు కలిగిన కల్యాణ మండపంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, కౌరు శ్రీను, నామన నాగభూషణం, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE

NADIMPALLI LAKSHMI PRIYANKA W/o Namburi Nithin Resident of DNo. 3-95/1, Godi Village Allavaram Mandal,Dr.B.R.Ambedkar Konaseema Dist.Have Changed My Name From NAMBURI LAKSHMI PRIYANKA (old Name) to NADIMPALLI LAKSHMI PRIYANKA (New Name) Shall Hence forth be known NADIMPALLI LAKSHMI PRIYANKA for all practical purposes

అన్నక్యాంటీన్ పరిశీలన

మండపేట, ఆగస్టు14: మండపేట ఏడిద రోడ్డులో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఈనెల16న అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేష్, కాంట్రాక్టర్ శిరంగు ఈశ్వరరావు పాల్గొన్నారు.స్థానిక కలవపువ్వు సెంటరులో ఉన్న కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేశారు.

విద్యార్థులకు వెండి పళ్లాలు అందజేత

మండపేట, ఆగస్టు 14: మండపేట గౌతమి మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉద్యోగవిరమణ చేసిన సీహెచ్.శోభావళి బుధవారం పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వెండి పళ్లాలు అందజేశారు. వీటిని విద్యార్థులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో నాయుడు రామచంద్రరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం



రావులపాలెం, ఆగస్టు 14: పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి రావులపాలెంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి ఇంటి వద్ద కాసేపు ఆగారు. ఆయనకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, కేవీ సత్యనారాయణరెడ్డి, టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్, చిలువూరి సతీష్ రాజు, బీజేపీ నాయకులు పాలూరి సత్యానందం, తమలంపూడి రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

అంబాజీపేట, ఆగస్టు 14: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కృషిచేయాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన దేశనేతల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, కుసుమ సత్యనారాయణ, నెల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను మార్చండి

ఆలమూరు, ఆగస్టు14: జొన్నాడలో 2016లో యూనియన్ బ్యాంక్ బ్రాంచి ప్రారంభించారు. ఈగ్రామంలో 150డ్వాక్రా సంఘాలు ఉండగా దాదాపు 1500 మంది సభ్యులు ఉన్నారు. అయినప్పటికీ వారి ఖాతాలను ఆలమూరులోనే కొనసాగిస్తున్నారు. తాము ప్రతినెలా పొదుపు, రుణాల చెల్లింపులు జమ చేయడానికి జొన్నాడ నుంచి ఆలమూరుకు రావాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో తమ ఖాతాలను జొన్నాడకు బ్రాంచికి మార్పు చేయాలని మేనేజరును వారంతా కోరారు. డ్వాక్రా సంఘాల మహిళలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆలమూరు బ్రాంచి మేనేజరుతో చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఖాతాలు మార్పు చేసేలా చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు వారు చెప్పారు.

మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా కుమారి

మామిడికుదురు, ఆగస్టు 14: మామిడికుదురు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా నగరం సర్పంచ్ జాలెం రమణకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహించిన అడబాల తాతకాపు పి.గన్నవరం నియోజకవర్గ సమాఖ్య అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో ఈఎన్నిక జరిగింది. కుమారిని సర్పంచ్‌లు పూలమాలలతో సన్మానించారు.

వైద్యురాలిని హత్యచేసిన వారిని శిక్షించాలి

కొత్తపేట, ఆగస్టు 14: కోల్‌కతాలో ఓ మహిళా వైద్యురాలిపై దుండగుడు ఆత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గన్నవరపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. అక్కడి ప్రభుత్వం స్పందించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ వంశీ, డాక్టర్ దుర్గాకుమారి పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దు

కపిలేశ్వరపురం, ఆగస్టు14:బాలలను పనిలో పెట్టుకుంటే బాలకార్మిక చట్టం ప్రకారం జైలుశిక్షతో పాటు జరిమానాకు బాధ్యులవుతారని మండపేట సహాయ కార్మికఅధికారి శివనాగమల్లేశ్వరరావుఅన్నారు. బుధవారం అంగర, కపిలేశ్వరపురం, టేకి ప్రాంతాల్లో బాలకార్మికులను గుర్తించేందుకు కార్మిక, పోలీస్, విద్య, ఐసీడీఎస్, జేకెఎల్ఎన్‌జీవోల బృందంతో కలిసి ఆయన పర్యటించారు.

పేకాట శిబిరంపై దాడి: ఏడుగురి అరెస్టు

కొత్తపేట, ఆగస్టు 14: కొత్తపేట కెనాల్ రోడ్డులో పేకా డుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వ ర్యంలో సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. ఏడుగురిని అదు పులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.43,310 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ముమ్మిడివరం, ఆగస్టు 14: విద్యార్థులంతా సత్ప్రవర్తన కలిగి పరస్పర స్నేహభావంతో మెలగుతూ ఉన్నత చదువులు అభ్యసించి లక్ష్యాన్ని అధిరోహించాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలపై బుధవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ఎస్ఐ డి.జ్వాలా సాగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


పేపరు జెండాలనే ఉపయోగిద్దాం

ఆత్రేయపురం, ఆగస్టు14: మెర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో పేపరుజెండాల తయారీపై చిన్నారులకు బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్లాస్టిక్ జెండాలను విడనాడి పేపరు జెండాలను వినియోగించ డం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకుని దేశభక్తి చాటుకోవాలని సూచించారు. 78పేపరు జెండాలను తయారు చేయగా సర్పంచ్ మెర్ల రాము పంపిణీ చేశారు.

సొసైటీ రికార్డుల కంప్యూటరీకరణ

కె.గంగవరం, ఆగస్టు 14: సొసైటీ రికార్డుల కంప్యూటరీకరణ వేగంగా చేస్తున్నా మని, దీనికి రైతులు సహకరించాలని అముజూరు సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. రైతులు ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫోటోలు తీసుకువచ్చి కంప్యూటరీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

హైస్కూల్‌కు దాతల విరాళాలు



దాత విరాళంతో నిర్మించిన కళావేదిక

మామిడికుదురు, ఆగస్టు 14: మొగలికుదురు లోని హైస్కూలు ప్రాంగణంలో డాక్టర్ కాశిన సుధాకర్-గీత దంపతుల జ్ఞాపకార్థం స్కూల్ స్థల దాతలు, పతి బ్రదర్స్ ఇచ్చిన రూ.8లక్షల విరాళంతో కళావేదిక నిర్మించారు. స్కూలులో 1997-98లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు రూ.15వేలు విలువైన బీరువాను, 1991-92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.75వేలు విలువైన కంప్యూటర్, టేబుల్, ఇన్వర్టర్‌ను, మొగలికుదురుకు చెందిన శ్రీచౌడేశ్వరి చిట్‌ఫండ్‌వారు రూ.10వేలు విలువైన బీరువా, ఆరుమల్లి వెంకటలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమార్తె ఆరుమల్లి ఆదిలక్ష్మి రూ.15వేలు విలువైన బీరువాను బహూకరించారు. అదేవిధంగా విశ్రాంత ఎల్ఐసీ డెవలెప్‌మెంట్ అధికారి ఎంవీవీకే దుర్గారావు విద్యార్థుల యూనిఫార మ్ నిమిత్తం రూ.25వేలు స్కూలుకు బహూకరించారు. విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారాన్ని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ముమ్మిడివరం, ఆగస్టు 14: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. స్థానిక పరిశ్రమల వారి సహకారంతో ప్రస్తుతం ఉన్న నూతన సాంకేతికతను ఉపయోగించి పరిశ్రమల నైపుణ్యత గల ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. కనీసం 8వ తరగతి అంత కన్నా ఎక్కువ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు వినోద్ సెల్ నంబరు 8099183854ను సంప్రదించాలని లోకమాన్ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ఐ.పోలవరం, ఆగస్టు 14: గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న తిళ్ళకుప్పకు చెందిన మంచిగంటి యషీకఅలీవ్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షలు మంజూరైంది. బుధవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చెక్కును అందించారు. సర్పంచ్ కడియం తమ్మయ్య, కడియం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ విజ్జుల్ రాజు, జంపన బాబు, ముదునూరి రామలింగరాజు, శ్రీనురాజు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

మలికిపురం, ఆగస్టు 14: పటమటి నోయల్(19) మృతదేహం లభ్యమైంది. మలికిపురానికి చెందిన నోయల్ ఈనెల9వ తేదీ నుంచి కనిపించడంలేదని తండ్రి రత్నరాజు ఫిర్యాదు చేశారు. దిండి-చించినాడ వంతెన వద్ద బండి వదిలి వెళ్లిపోయాడు. అంతర్వేది పల్లిపాలెంలో నోయల్ మృతదేహం లభ్యమైంది. అతడికి గుడిమెళ్లంకకు చెందిన ఒక యువతితో సంబంధం ఉన్నట్టు తెలిసింది. నోయల్ మృతికి యువతి కుటుంబ సభ్యులపై అనుమానం ఉన్నట్టు పోలీసుల దృష్టికి నోయల్ కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ

అంబాజీపేట, ఆగస్టు 14: మహిళ మెడలోని పుస్తెలతాడును ఇద్దరు వ్యక్తులు అపహరించారు. ముక్కామల బుద్ధనగర్‌కు చెందిన మోరంపూడి నాగమణి స్థానికంగా ఒక షాపు నిర్వహిస్తుంది. మంగళవారం రాత్రి 9 గంటలకు షాపు మూసివేసి ఇంటికి నడిచి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని మంగళసూత్రాలతో ఉన్న పుస్తెల తాడును లాక్కుని పరారయ్యారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు

పి.గన్నవరం, ఆగస్టు 14: సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిసాయి. మూడు రోజులు పాటు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ముఖ్యంగా పంచాయతీల విధులు, బాధ్యతలు, అధికారాలు, లక్ష్యాలు, 15వ ఆర్థిక సంఘం నియమ నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన కల్పించామని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షురాలు యర్రంశెట్టి త్రివేణి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	భవనమ్
శ్రీలలిత	కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	తుఫాన్
శేఖర్ స్క్రీన్-2	బడ్డీ
రమా	రాయన్
గణపతి	సూపర్ డీలక్స్
వెంకటపద్మావతిస్క్రీన్-1	కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	సింబా